## నక్సల్స్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ...




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## కబడ్డీ పోటీల్లో మెరిసిన ముదిగొండ మండలం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 312 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 05 నవంబర్ 2025

# ‘డిజిటల్ అరెస్ట్’ స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

**డిజిటల్ అరెస్ట్’ పేరుతో కొత్త తరహా మోసాలు**

**పోలీసులు, సీబీఐ అధికారులమంటూ బెదిరింపులు**

**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎన్పీసీఐ సూచన**

**సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని వెల్లడి**




**న్యూఢిల్లీ,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** దేశవ్యాప్తంగా కొత్త తరహా సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, ‘డిజిటల్ అరెస్ట్’ పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) మిగతా 2లో...

# చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

**డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం**

**రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు**

**నివేదిక పంపాలని కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా ఆదేశం**



**హైదరాబాద్, నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద కంకర లోడుతో వస్తున్న టిప్పర్...మిగతా 2లో...



# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు

## చెల్లిని గెంటేసిన నీచుడు కెటిఆర్

## రహమత్ నగర్ రోడ్‌షోలో సిఎం రేవంత్

## నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే



**హైదరాబాద్, 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీ తో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్ లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయ ండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ..మిగతా 2లో...

## ఛత్తీస్‌గఢ్‌లో గూడ్స్ రైలును ఢీకొట్టిన ప్యాసింజర్ రైలు... ఆరుగురు మృతి!

**ఛత్తీస్‌గఢ్,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):**



ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో నేడు ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. జైరామ్‌నగర్ స్టేషన్ సమీపంలో ఒక ప్యాసింజర్ రైలు, గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కనీసం ఆరుగురు మరణించినట్లు భావిస్తున్నారు. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.ప్రాథమిక సమాచారం ప్రకారం, కోర్బా ప్యాసింజర్ రైలు, ఆగి ఉన్న ఒక గూడ్స్ రైలును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ప్యాసింజర్ రైలు మొదటి బోగీ.. గూడ్స్ రైలు పైకి ఎక్కింది. ప్రమాద స్థలం నుంచి వచ్చిన వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఆరుగురు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నష్టం అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది...

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

**న్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు : ఇసి**




**న్యూఢిల్లీ,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇప్పటికే బీహార్‌లో తీవ్ర నిరసనలు చెలరేగాయి. ఇప్పుడు బెంగాల్లో మమతా బెనర్జీ స్వయంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఫేజ్-2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను ..మిగతా 2లో...

# ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం

**జూబ్లీహిల్స్ ప్రచారంలో రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్, నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. తెలంగాణను దివాళా తీయించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి బతిమిలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకునే లాగా చేశారని ధ్వజమెత్తారు...మిగతా 2లో...



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

**తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ సెంటర్లు, విస్తరణపై చర్చ**

**పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ**

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**




## మంత్రి అజారుద్దీన్‌కు రెండు కీలక శాఖలు

**తెలంగాణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్**

**ఆయనకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి**

**మైనార్టీ సంక్షేమ శాఖ బాధ్యతల అప్పగింత**

**అదేవిధంగా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కేటాయింపు**




# జాబ్ క్యాలెండర్‌తో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**




# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్**

**ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం**

**హైదరాబాద్, నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది...మిగతా 2లో...



## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

(మొదటి పేజి తరువాయి)

బస్సును ఢీకొనడంతో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించింది.రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను సైతం నివేదిక పంపాలని ఆదేశించింది. ప్రమాద సమయంలో ట్రక్కులోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక వారు మృతి చెందారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్, నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**

జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది. పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

## మంత్రి అజారుద్దీన్‌కు రెండు కీలక శాఖలు

**హైదరాబాద్, నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** ఇటీవల తెలంగాణ మంత్రిగా నియమితులైన భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో శాఖలను కేటాయించారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.క్రికెటర్‌గా దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన అజారుద్దీన్, రాజకీయాల్లోకి ప్రవేశించి గతంలో ఎంపీగా కూడా పనిచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా కొత్త బాధ్యతలను స్వీకరించబోతున్నారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖను కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

## ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం

(మొదటి పేజి తరువాయి)

కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 165 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ౹ ÷ర్ అయ్యారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. కేసీఆర్ హయాంలో అద్భుతంగా నడిచిన పాఠశాలలు మూతపడేలాగా చేశారని ఆక్షేపించారు. హస్తం పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 100 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. ఇవాళ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను ఆగం చేశారని విమర్శించారు. ఆయనకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. హైడ్రా పేరుతో పేదల ఇల్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆఖరి స్థానంలో నిలబెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

(మొదటి పేజి తరువాయి)

బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ నెల పాటు డిసెంబర్ 4 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు.

## జాబ్ క్యాలెండర్ తో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్,అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# 'డిజిటల్ అరెస్ట్' స్కాంలపై ఎన్‌పీసీఐ హెచ్చరిక

(మొదటి పేజి తరువాయి)

మంగళవారం కీలక సూచనలు జారీ చేసింది. సైబర్ నేరగాళ్లు పోలీసు, సీబీఐ, కస్టమ్స్, ఆదాయ పన్ను శాఖ అధికారులమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించింది.

**మోసం చేసే విధానం ఇదే...!**

ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసంలో నేరగాళ్లు మొదట సాధారణ ఫోన్ కాల్ చేసి, ఆ తర్వాత బాధితులను నమ్మించడానికి వీడియో కాల్స్‌కు మారతారు. తాము ప్రభుత్వ అధికారులమని చెప్పి, బాధితులపై లేదా వారి కుటుంబ సభ్యులపై మనీ లాండరింగ్, డ్రగ్స్ రవాణా లేదా పన్ను ఎగవేత వంటి తీవ్రమైన కేసులు నమోదయ్యాయని బెదిరిస్తారు.తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అరెస్ట్ చేస్తామని హెచ్చరిస్తూ బాధితుల్లో భయాన్ని సృష్టిస్తారు. వీడియో కాల్స్ సమయంలో నకిలీ యూనిఫాంలు, ప్రభుత్వ లోగోలు, పోలీస్ స్టేషన్ వంటి నకిలీ నేపథ్యాలను సృష్టించి బాధితులను పూర్తిగా నమ్మిస్తారు. అంతటితో ఆగకుండా, తాము చెప్పేది నిజమేనని భ్రమింపజేసేందుకు వెనుక వైపు అధికారిక కార్యాలయాల్లో వినిపించే శబ్దాలు వచ్చేలా చూసుకుంటారు.కేసు విచారణ పూర్తయ్యే వరకు కొంత మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని బాధితులపై ఒత్తిడి తెస్తారు. "మీ పేరును కేసు నుంచి తొలగించడానికి", "విచారణకు సహకరించడానికి" లేదా "రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్" వంటి మాటలు చెప్పి మోసపూరితంగా డబ్బులు బదిలీ చేయించుకుంటారు.ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే ఏమాత్రం ఆందోళన చెందవద్దని ఎన్‌పీసీఐ సూచించింది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఎప్పుడూ ఫోన్ లేదా వీడియో కాల్స్ ద్వారా విచారణ జరపవని, డబ్బులు డిమాండ్ చేయవని స్పష్టం చేసింది. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఇలాంటి ఆరోపణలు చేస్తే, వెంటనే కాల్ కట్ చేసి వారి వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపింది. అనుమానాస్పద నంబర్ల నుంచి కాల్స్ వస్తే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ, లేదా టెలికమ్యూనికేషన్ శాఖకు చెందిన 'సంచార్ సాథీ' పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేయాలని సూచించింది. మోసగాళ్లతో జరిపిన సంభాషణలకు సంబంధించిన మెసేజ్‌లు, స్క్రీన్‌షాట్‌లను భద్రపరుచుకుంటే, ఫిర్యాదు చేసేటప్పుడు అధికారులకు సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని ఎన్ పీసీఐ తన ప్రకటనలో వివరించింది.

# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు


(మొదటి పేజి తరువాయి)

అలాంటి పీజేఆర్ చనిపోతే.. ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు కూడా పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. 'పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేట లో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్.. మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించిన ది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి పేజి తరువాయి)

దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు



రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది.

6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

## నక్సల్స్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ... ఆయుధ కర్మాగారాన్ని ధ్వంసం చేసిన డీఆర్‌జీ బలగాలు

**ఛత్తీస్‌గఢ్,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని దట్టమైన అడవుల్లో రహస్యంగా నడుపుతున్న ఆయుధాల తయారీ కర్మాగారాన్ని డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బలగాలు గుర్తించి ధ్వంసం చేశాయి. ఈ మెరుపుదాడిలో భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కోయిమెంట-ఎరపల్లి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు.

కొన్ని నెలలుగా మావోయిస్టులు ఈ ఫ్యాక్టరీని అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. సోలార్ ప్యానెళ్ల సహాయంతో నడిచే ఈ వర్క్‌షాప్‌లో ఆయుధాలను తయారు చేస్తున్నట్లు బలగాలు గుర్తించాయి. దాడి సమయంలో సగం తయారైన 17 నాటు తుపాకులు,



బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, పెద్ద మొత్తంలో ఉక్కు రాడ్లు, ట్రిగ్గర్ మెకానిజమ్స్, లేత్ మెషీన్లు, వెల్డింగ్ కిట్లు, డ్రిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు మందుపాతరల తయారీకి సిద్ధంగా ఉంచిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, సర్క్యూట్ బోర్డులను కూడా సీజ్ చేశారు.ఈ ఆపరేషన్ వివరాలను సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ మీడియాకు వెల్లడించారు. కొద్ది వారాల క్రితం లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన కచ్చితమైన సమాచారంతోనే ఈ స్థావరాన్ని గుర్తించగలిగామని తెలిపారు. ఆ స్థావరంలో ఆర్మీ రైఫిళ్లతో సరితూగే ఆయుధాలను తయారు చేసేందుకు సంబంధించిన బ్లూప్రింట్లను కూడా కనుగొన్నట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 249 మంది నక్సలైట్లను మట్టుబెట్టినట్లు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు వంటి అగ్రనేతలు కూడా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "వరుస ఎదురుదెబ్బలతో బలహీనపడిన మావోయిస్టులు, ఈ ఫ్యాక్టరీ ద్వారా మళ్లీ పుంజుకోవాలని చూశారు. కానీ మేం వారి ప్రయత్నాన్ని సమాధి చేశాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ అనంతరం స్థావరంలోని పేలుడు పదార్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేసి, మొత్తం ఫ్యాక్టరీని దగ్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా సిబ్బంది సురక్షితంగా తమ శిబిరానికి చేరుకున్నారు.

## ఈవీఎంలు గట్టిగా నొక్కండి... ఆ మోత ఇటలీ దాకా వినపడాలి: అమిత్ షా

**బీహార్,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** బీహార్‌లో మళ్లీ 'జంగిల్ రాజ్' (అరాచక పాలన)ను ప్రజలు కోరుకోవడం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిల పాలనలో రాష్ట్రం అరాచకంగా మారిందని, ఆ చీకటి రోజులను ఎవరూ మర్చిపోలేరని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పశ్చిమ చంపారన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. "నవంబర్ 6, 11 తేదీల్లో ఈవీఎం బటన్‌ను ఎంత గట్టిగా నొక్కాలంటే, ఆ మోత ఇటలీలో ప్రతిధ్వనించాలి" అంటూ ఓటర్లకు ఆయన పిలుపునిచ్చారు. 1990లు, 2000ల ప్రారంభంలో రాష్ట్రంలో నేరాలు, అరాచకాలు పెరిగిపోయాయని గుర్తుచేసిన అమిత్ షా, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయని తెలిపారు. లాలూ-రబ్రీ హయాంలోనే రాష్ట్రంలోని అనేక చక్కెర మిల్లులు మూతపడ్డాయని ఆరోపించారు. మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి వస్తే, మూతపడిన అన్ని మిల్లులను తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.సోనియా గాంధీ, లాలూ ప్రసాద్ యాదవ్‌లను లక్ష్యంగా చేసుకుని అమిత్ షా విమర్శలు గుప్పించారు. "ఒక నాయకురాలు తన కొడుకును ప్రధానమంత్రిని చేయాలని చూస్తుంటే, మరో నాయకుడు తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలని ఆరాటపడుతున్నారు. కానీ ఢిల్లీలో గానీ, పాట్నాలో గానీ కుర్చీలు ఖాళీగా లేవని వారు గుర్తుంచుకోవాలి" అని ఆయన ఎద్దేవా చేశారు.రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ, 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ భద్రత విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని, ఆర్టికల్ 370 రద్దు కూడా అందులో భాగమేనని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కొందరు నేర చరితులను వెనకేసుకొస్తున్నా యని, అలాంటి శక్తులను ఓటర్లు తిరస్కరించాలని కోరారు.

# నకిలీ విత్తనాలపై ఏడిఏకు వినతి పత్రం

**పేరు లేని కంపెనీ విత్తనాలు కొనొద్దు**

**రైతు రక్షణ సమితి హెచ్చరిక**



**పరకాల, నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో రైతులు నకిలీ విత్తనాలకు బలికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు పిలుపునిచ్చారు. పరకాల వ్యవసాయ అభివృద్ధి అధికారి (ఏడీఏ) కార్యాలయానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కొన్ని పేరు లేని కంపెనీలకు చెందిన దళారీలు గ్రామాలకు చేరుకుని అధిక దిగుబడులు వస్తాయని చెబుతూ రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కంపెనీలకు ప్రభుత్వ అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండానే రైతులకు విత్తనాలు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. "ఇలాంటి విత్తనాలు వాడితే రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడవలసి వస్తుంది. కాబట్టి రైతులు ప్రభుత్వ గుర్తింపు ఉన్న కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. అవసరమైతే ముందస్తు ఒప్పందాల ద్వారా పంట సాగు చేయాలి," అని కిషన్ రావు సూచించారు. తుఫాను కారణంగా ఇప్పటికే పంటలు నష్టపోయిన రైతులు మళ్లీ మొక్కజొన్న పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, నకిలీ విత్తనాలు అందితే పరిస్థితి మరింత దయనీయమవు తుందని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మండలం లో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు పూర్తి సమాచారం అందించాలని సమితి అధికారులు ఏడీఏను కోరారు. ఇక ఈ కార్యక్రమంలో నాగూర్ల రాజీవ్ మోడే మోహన్ రావు బాసిడి బాపూరావు జుంక జువ్వ రవి రైతు రక్షణ సమితి సంఘం రైతులు పాల్గొన్నారు

# రైతు ప్రయోజనాలే లక్ష్యం: చందుపట్ల రాజిరెడ్డి కీలక విజ్ఞప్తి



**పరకాల, నవంబర్ 04 (పీసిడబ్ల్యూ న్యూస్):** పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యుడు చందుపట్ల రాజిరెడ్డి రైతు సోదరులకు విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన పత్తిని 8% నుండి 12% వరకు తేమ శాతం మించకుండా CCI (భారత పత్తి సంస్థ) వారు కేటాయించిన అధికారిక కొనుగోలు కేంద్రాలకే తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. ఇలా చేస్తే రైతులు కిలోకు ?8110 మద్దతు ధర పొందగలరని తెలిపారు. అలాగే పత్తిని విక్రయకేంద్రాలకు తీసుకువెళ్లే సమయంలో వాతావరణంలో మార్పుల వల్ల వర్షాలు పడే అవకాశం ఉన్నందున, తర్పాలిన్‌తో పత్తిని కప్పి రక్షించుకోవాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుండే చందుపట్ల రాజిరెడ్డి నాణ్యమైన పత్తి విక్రయం ద్వారా ప్రతి రైతు లాభం పొందాలని ఆకాంక్షించారు.


# గ్రేటర్ వరంగల్ ను వరద ముంపు ముప్పు నుండి శాశ్వత పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

**డ్రైన్ డక్ట్ లు, రీటైనింగ్ వాల్స్ నిర్మాణం, నాలాలు,డ్రైన్స్ విస్తరించాలి**

**హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద**

**కుడా కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో వరద ముంపు నుండి రక్షణ చర్యలపై జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సమీక్ష**





**హన్మకొండ,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ వరంగల్ నగరానికి వరద ముంపు ముప్పు నుండి తప్పించేందుకు శాశ్వతమైన పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలను అధికారులు సమన్వయం తో రూపొందించాలని హనుమకొండ, వరంగల్, జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ లోని కుడా కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలో వరద ముంపు బారీ నుండి నగరాన్ని రక్షించేందుకు మున్సిపల్, రెవెన్యూ, సాగు నీటి పారుదల, రెవెన్యూ, కుడా ఇతర శాఖల అధికారులతో కలెక్టర్లు, గ్రేటర్ కమిషనర్ లు రూపొందించాల్సిన సమగ్ర ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. నగరం లోనికి ప్రధానంగా వరద నీరు ఏయే ఎగువ ప్రాంతాల నుండి వస్తుంది, ఉన్న నాలాలు, వాటి సామర్థ్యం, కచ్చా నాలాలు, గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో ఉన్న చెరువులు, ముంపు కాలనీలు, డ్రైన్ డక్టులు, ప్రస్తుతం చెరువుల పరిస్థితి, ఆక్రమణలు, నగరం నుండి వరద నీటిని సురక్షితంగా బయటకు పంపేందుకు ఉన్న మార్గాలు, ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో, డ్రైన్ డక్టుల నిర్మాణం, నాలాలు, డ్రైనేజీల విస్తరణ, నిర్మాణ వ్యయం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ నగరంలో భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా వరద ముంపు నుండి తప్పించేందుకు శాశ్వత సమగ్ర ప్రణాళిక ను రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని, ఈ మేరకు నిపుణుల సలహాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ వరద ముంపు శాశ్వత నివారణకు పటిష్టమైన ప్రణాళిక తయారు చేయాలన్నారు. వరద నీరు కాలనీల నుండి నేరుగా నగరం నుండి బయటికి వెళ్లే విధంగా ప్రణాళిక ఉండాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాలో అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, మున్సిపల్, ఇరిగేషన్ ఎస్ ఈ లు సత్య నారాయణ, రాంప్రసాద్, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, హనుమకొండ, వరంగల్ ఆర్డీవో లు రాథోడ్ రమేష్, సుమ, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఊరి నుండి గుట్ట పైకి బయలుదేరిన శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి





**రేగొండ,నవంబర్ 04 (పీసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ జిల్లా రేగొండ మండల కేంద్రంలోని తిరుమలగిరి గ్రామ శివారులోని శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈరోజు స్వామివారిని ఊరి నుండి గుట్టపైకి రథంపై ఊరేగింపుతో గుట్టపైన కొలువుదీరనున్నారు . ఈరోజు నుండి నాలుగు రోజులు బ్రహ్మోత్సవాలు జాతర వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. మ్రొక్కులు తీర్చుకోనికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను గుట్టపైన చెల్లించుకుంటారు. ఏనుగు వాహనములు. ప్రభ బండ్లు గుట్ట క్రింద తిరిగి మ్రొక్కుకున్న మోక్కులు తీర్చుకుంటారు. భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించామని ఆలయ ఈవో శ్రీనివాస్. ఆలయ చైర్మన్ రమణారెడ్డి. అర్చకులు కురుమచల వెంకన్న. వెల్లడించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

**● పరకాల సిఐ క్రాంతి కుమార్ సూచన**




**పరకాల, నవంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సిఐ సూచించారు. ప్రస్తుతం పరకాల పరిధిలోని చెరువులు, కుంటలు నిండుకుండాలా ఉన్నాయని, ఎక్కడైనా వాగులు పొంగిపోవచ్చు కాబట్టి వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అలాగే రోడ్లపై గుంతలు ఉన్న ప్రాంతాల్లో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. తడిచిన కరెంటు స్థంభాలు, ట్రాన్స్ఫార్మర్ల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు. పాత మట్టి గోడలతో ఉన్న ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉండటంతో అటువంటి ప్రాంతాల్లో నివసించే ప్రజలు సమీప బంధువుల ఇళ్లకు లేదా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. "జన భద్రతే మా ప్రాధాన్యం. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకండి. ఎలాంటి ప్రమాద పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బాలల అక్రమ రవాణా నిర్మూలన, సైబర్ క్రైమ్ నేరాల పట్ల జాగ్రత్తలు






**హన్మకొండ,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** హసన్‌పర్తి ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు మానవ మరియు బాలల అక్రమ రవాణా నిర్మూలన పై మరియు సైబర్ క్రైమ్ నేరాల పట్ల జాగ్రత్తలు పై అవగాహన సదస్సు ఎఫ్ఎంఎం సాంఘిక సేవ సమితి మండల కో..ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగినది. ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ భార్గవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ నేర నిరోధక విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ మానవ మరియు బాలల అక్రమ రవాణా రాష్ట్రంలో, దేశంలో, జిల్లాలలో ప్రజలను కొనుక్కోవడానికి అమ్ముకోవడానికి లాభార్జన కోసం కొన్ని ముఠాలు ఏర్పడి ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి మనుషులను వ్యాపారం నిమిత్తం బానిసలుగా, కర్మా గారాలలో వేతనం లేని కూలీలుగా, అధిక వేతనం ఇస్తానని ప్రలోభ ప్రలోభాలకు గురి చేస్తూ, జాబుల పేరు మీద నా ఉద్యోగాల పేరు మీద సినిమా స్టార్ పేరు మీద మ్యారేజ్ ల పేరు మీద వేతనాల పేరుమీద కారు భవనాల పేరు మీద ఆశ చూపి మానవులను తరలిస్తూ ప్రజలను అమాయకులను బిక్షటనగా, వ్యభిచారులు గా తయారు చేసి కొన్ని ముఠాలు వ్యాపారం చేస్తున్నాయి, పేద తల్లిదండ్రులను ఆశపెట్టి చిన్న పిల్లలను కొనుగోలు చేసి పిల్లల దంపతులకు సరోగసి పేరుమీద సొంత పిల్లలని మాయ చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల గుడ్డిగా నమ్మకుండా వారు చెప్పే కపటమైన ప్రలోభ మాటలకు లొంగవద్దని ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల రోజును పురస్కరించుకొని ప్రతి ఆశ ఒక క్షేత్రస్థాయి అవేర్నెస్ తీసుకురావాలని డోర్ టు డోర్ ఉన్నటువంటి పేరెంట్స్ కు ఇంస్టాగ్రామ్ ఫేస్బుక్ యూట్యూబ్ ట్విట్టర్ స్నాప్ చాట్ గూగుల్ లాంటి వాటిపైన నిఘా ఉంచాలని పిల్లలను సెల్ఫోన్ కు దూరంగా ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ భార్గవ్ఏ హెచ్ టి యు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ఎఫ్ ఎం ఎం కో..ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ సబ్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి ఏఎస్ఐ భాగ్యలక్ష్మి , కానిస్టేబుల్ రామారావు , ఎండి మొహసిన్ భాష, షేర్ ఫీల్డ్ కో..ఆర్డినేటర్ జమున, డాక్టర్స్ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు, ప్రైమరీ హెల్త్ సెంటర్ స్టాఫ్ 60 మంది పాల్గొన్నారు.

# నేడు మల్లంపల్లి కెనాల్ దగ్గర ఎన్హెచ్ రహదారి మూసివేత

**ములుగు నుండి వచ్చే భారీ వాహనాలు అబ్బాపూర్ మీదుగా చిన్న వాహనాలు భూపాల్ నగర్ మీదుగా వెళ్లాలి**

**హనుమకొండ నుంచి వచ్చే భారీ వాహనాలు వయా పర్కాల్, చిన్న వాహనాలు శ్రీనగర్ మీదుగా రావాలి: ఎన్ హెచ్ ఏఈ చైతన్య**



**మల్లంపల్లి మండల ప్రతినిధి నవంబర్ ఐదు (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద జాతీయ రహదారి (ఎన్హెచ్) బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాతీయ రహదారిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వాన దారులు సహకరించాలని నేషనల్ హైవే ఏఈ చైతన్య మంగళవారం తెలిపారు. కెనాల్ వద్ద రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా వాహనాల రాకపోకలతో ఇబ్బందులు జరుగుతున్నందున ఒక్కరోజు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ములుగు నుండి హనుమకొండ వెళ్లే వాహనాలు భారీ వాహనాలు అబ్బాపూర్ మీదుగా చిన్న వాహనాలు భూపాల్ నగర్ మీదుగా వెళ్లాలని, అదేవిధంగా హనుమకొండ నుంచి వచ్చే భారీ వాహనాలు గూడెపాడ్ వయా పరకాల మీదుగా చిన్న వాహనాలు శ్రీనగర్ భూపాల్ నగర్ మీదుగా ములుగు వెళ్లాలని ఆయన తెలిపారు. వాహనాలదారులు సహకరించాలని ఆయన కోరారు.

# కబడ్డీ పోటీల్లో మెరిసిన ముదిగొండ మండలం

**జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో రన్నర్ గా నిలిచిన ముదిగొండ బాలికలు**

**తనికెళ్ల సెయింట్ అలోసిఎస్ పాఠశాలలో ముగిసిన అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలు**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కొణిజర్ల మండలం తనికెళ్లలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో అండర్ 17 బాలికల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో ముదిగొండ మండల విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచి 4 టీమ్ లను ఓడగొట్టి జిల్లాస్థాయిలో రన్నర్ గా నిలిచారు. ఈ పోటీలో బి. కావ్య, కె. లావణ్య (ఎడవల్లి), కీర్తి, చందన(మేడేపల్లి), రమ్య( మాదాపురం), కేజీబీవీ ముదిగొండకు చెందిన హేమలత అత్యంత ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులు భాగా ఆడి జిల్లా స్థాయిలో రన్నర్ గా నిలవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పిడిలు అభినందించారు. ఈ పోటీలలో పిడి కృష్ణారావు కోచ్ గా వ్యవహరించారు. ఈ క్రీడా పోటీలలో కేజీబీవీ ముదిగొండ పిడి పి.సునీత, ఎడవల్లి క్రీడల ఇంచార్జ్ బి. శ్రీనివాసరావు, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పాఠశాల సమీపంలో ఉన్న వైన్స్ బెల్ట్ షాపులు తొలగించాలి

**ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేత**

**విసికే యూత్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్**



**చిట్యాల నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల సమీపంలో ఉన్న వైన్స్ మరియు బెల్ట్ షాపులను తొలగించాలని చిట్యాల ఎమ్మార్వో ఇమామ్ బాబా షేక్ గారికి వినతి పత్రం ఇచ్చిన vck యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్ మరియు dyfi భూపాలపల్లి జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్ పాల్గొన్నారు

## ఓపెన్ టెన్త్, ఇంటర్ టెక్స్ బుక్స్ పంపిణీ




**హన్మకొండ,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65 డివిజన్ ఎల్లాపూర్ గ్రామం ఓపెన్ టెన్త్, ఇంటర్ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అక్రిడిటెడ్ ఇనిస్టిట్యూట్ కో ఆర్డినేటర్ జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ఎల్లాపూర్ ప్రధానోపాధ్యాయులు పుల్ల. సంపత్ ఆధ్వర్యంలో 30 మంది ఓపెన్ టెన్త్ , ఇంటర్ 2025-2026 సంవత్సరం అభ్యర్థులకు మంగళవారం సంపత్ ఆదేశాల మేరకు ఇన్చార్జి హెచ్ యం సాల్మన్ రెడ్డి ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా వ్రాయబోయే అభ్యర్థులు బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని అన్నారు. పాఠశాల ఇన్చార్జి హెచ్ యం సాల్మన్ రెడ్డి, అసిస్టెంట్ కో.. ఆర్డినేటర్ పి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు జి వి ప్రసాద్, ముంతాజు అలి, రజితదేవి, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ఖమ్మం జాతీయ రహదారి పై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి




**హన్మకొండ,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** నగరంలోని రంగశాయిపేట 43వ డివిజన్ పరిధిలోని ఆర్టీఏ, నాయుడు పెట్రోల్ పంప్ సర్కిల్ నుండి తిమ్మాపూర్ క్రాస్ రోడ్ వరకు వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై జరుగుతున్న వరుస ప్రమాదాలను నివారించాలని కోరుతూ శ్రీ వినాయక కాలనీ అధ్యక్షులు పోలుసాని సుభాష్ రావు మంగళవారం మామునూరు సిఐ రమేష్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణ సముదాయాల ముందు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. అందువల్ల వాహనదారుల రవాణాకు అసౌకర్యం కలిగి పెద్దఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన సిఐ రమేష్ త్వరలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న వ్యాపారస్తుల వల్ల ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా మరియు ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక కాలనీ అధ్యక్షులు పోలుసాని సుభాష్ రావు మరియు సత్యసాయి నగర్ వాసి తరగల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బోరబండలో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ముమ్మర ప్రచారం

**- వివిధ వర్గాలకు బాకీ కార్డులు అందచేసిన బూడిద,కల్లూరి**



**యాదాద్రి నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్లో గాంధీనగర్ నగర్,అంబేద్కర్ నగర్,పెద్దమ్మ వాడలో వివిధ వర్గాలకు బాకీ కార్డు అందజేసిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరు రామచంద్రారెడ్డి, బొమ్మలరామారం మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బేడ బుడగ జంగాల కాలనీని వెంటనే అభివృద్ధి చేయాలి: సిరిపాటి వేణు డిమాండ్...

- **హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద జన సంఘం**
- **రాష్ట్ర అధ్యక్షులు ప్రకటనబీ పరిష్కరించకుంటే భారీ ధర్నా హెచ్చరిక**






**హుజురాబాద్,నవంబర్4(పీసీడబ్ల్యూ న్యూస్):** బేడ బుడగ జంగాల కాలనీ అభివృద్ధిపై దశాబ్దాలుగా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 40 ఏళ్లుగా కాలనీ అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఆ తర్వాత మర్చిపోతున్నారని ఆయన విమర్శించారు.సోమవారం, కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి, తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిరిపాటి వేణు మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మిషన్ భగీరథ పైప్‌లైన్లు, వీధి లైట్లు లేకపోవడంతో వర్షాకాలంలో మురికి నీరు నిలిచిపోయి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలు గత 40 ఏళ్లుగా స్థానిక నాయకులు, అధికారులు, కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని ఆయన ఆరోపించారు.**ప్రధాన డిమాండ్లు:**నిరుపేదలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలి.కాలనీలో తక్షణమే సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, స్మశాన వాటిక, కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. మున్సిపాలిటీకి మంజూరైన రూ. 15 కోట్ల నిధుల నుండి తమ కాలనీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.“అభివృద్ధి ఉన్నచోటనే కాకుండా, అభివృద్ధి లేని ప్రాంతాలనూ డెవలప్ చేయాలి” అని ఆయన డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో త్వరలోనే హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద 2000 మందితో భారీ ధర్నా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు.

## యువతిని బ్లాక్ మెయిల్ చేసిన నిందితుడిని అరెస్ట్


- **రిమాండ్‌కు తరలించిన దామెర పోలీసులు**




**దామెర, నవంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం, దామెర పోలీస్ స్టేషన్, పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు నేతృత్వంలో వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు మండలం అక్కెంపేట గ్రామానికి చెందిన కక్కెర్ల అనిల్ కుమార్ ఒక యువతిని ఆన్లైన్‌లో పరిచయం చేసుకొని, ఆమె ఫోటోలు తీసి డబ్బులు ఇవ్వమని బ్లాక్ మెయిల్ చేశాడు. యువతి రూ.50,000/- ఆన్‌లైన్‌లో పంపించాల్సి వచ్చింది. అయినప్పటికీ, నిందితుడు డబ్బులు మరల ఇవ్వకుంటే ఫోటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు.విసిగిపోయిన యువతి ఫిర్యాదు చేయడంతో దామెర పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు, కేసు నమోదు చేసి అనిల్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో ఎస్సై కొంక అశోక్ కూడా దర్యాప్తులో పాల్గొన్నారు.ఈ ఘటనలో పోలీసుల నిష్పక్షపాత దర్యాప్తు, సమర్థత, మరియు వేగవంతమైన చర్యలు యువతిని రక్షించడంలో కీలకంగా నిలిచాయి.

## హసన్ పర్తి రైల్వే స్టేషన్ వద్ద పలు రైళ్లు ఆపాలి

**- డిఆర్‌యంకి మెమోరాండం ఇచ్చిన 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్**



**హన్మకొండ,నవంబర్ 04 (పిసీడబ్ల్యూ న్యూస్):**మంగళవారం డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్. గోపాల కృష్ణన్ హసన్ పర్తి రైల్వే స్టేషన్ ను సందర్శించారు.ఈ సందర్భంగా వారికి స్వాగతం పలుకుతూ ఇంటర్సిటీ ఎక్స్ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్ప్రెస్ రైళ్లు హసన్ పర్తి స్టేషన్ వద్ద ఆగేలా అలాగే వివిధ అభివృద్ధి పనులు కొనసాగేలా మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారం తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి కోయడ రాజు, ఇమ్మడి కర్ణాకర్, కుంబర్కర్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అజిత్ కంపెనీ నూతన వరి రకం ARV-14 క్షేత్ర ప్రదర్శన

- **రైతుల్లో విశేష స్పందన**







**రేగొండ, నవంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనపర్తి గ్రామంలో మంగళవారం రోజున అజిత్ కంపెనీ ఆధ్వర్యంలో నూతన వరి రకం ARV-14 పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో రైతు ఏ. రమేష్ సాగుచేసిన ARV-14 రకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అజిత్ కంపెనీ ఏఆర్ఎం. టి. సురేష్ మాట్లాడుతూ, ‘ARV-14 రకం తెగుళ్లను, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడిని ఇస్తుంది. అలాగే సన్నగా, రుచికరంగా ఉండే ఈ రకం వినియోగదారుల నుంచి మంచి స్పందనను పొందుతోంది” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు రాజరాజేశ్వర ఫర్టిలైజర్స్ కే. మొగిలి, కంపెనీ ప్రతినిధులు సిహెచ్. శ్రీనివాస్, పి. రాజేష్, అలాగే సుమారు 150 నుండి 200 మంది రైతులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.రైతులు కొత్త రకం పట్ల ఆసక్తి చూపడం, అధిక దిగుబడి లక్షణాలు వివరించడం ద్వారా ఈ క్షేత్ర ప్రదర్శన విజయవంతంగా ముగిసింది.

## ట్రెజరీస్ , అకౌంట్స్ డైరెక్టర్‌గా కె. పార్వతి దేవి నియామకం:యునైటెడ్ టీమ్ అభినందనలు!



**హైదరాబాద్,నవంబర్4(పీసీడబ్ల్యూ న్యూస్):** ట్రెజరీస్ మరియు అకౌంట్స్ విభాగం, హైదరాబాద్‌కు డైరెక్టర్ (పూర్తి అదనపు బాధ్యత)గా కె.పార్వతి దేవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా యునైటెడ్ - తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసింది.యూనైటెడ్ - టీమ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నిసార్ అహ్మద్ మరియు సూపరింటెండెంట్ మొహమ్మద్ అబ్దుల్ ఫహీమ్ సంయుక్తంగా కె. పార్వతి దేవికి అభినందనలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.ఉద్యోగుల సంక్షేమం పట్ల **అంకితభావం పట్ల హర్షం:** “మీరు డైరెక్టర్ (పూర్తి అదనపు బాధ్యత)గా బాధ్యతలు స్వీకరించినందుకు మా హృదయపూర్వక అభినందనలు. మీరు శాఖ అభివృద్ధి మరియు ఉద్యోగుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఇచ్చిన హామీ మాకు ఆనందాన్ని కలిగించింది” అని యునైటెడ్ - టీమ్ నాయకులు పేర్కొన్నారు.శ్రీమతి కె. పార్వతి దేవి నాయకత్వంలో ట్రెజరీస్ మరియు అకౌంట్స్ శాఖ మరింత పురోగతి సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది.

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం గట్టాలి...

- **ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పిలుపు**



**హైదరాబాద్,నవంబర్4(పీసీడబ్ల్యూ న్యూస్):**జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం గట్టాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆ నియోజవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మహిళా కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుతో కలిసి జూబ్లీ హిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్ పేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ జూబ్లీ హిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్నా, నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరాలన్నా కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే ఏకైక మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు సేవాతత్పరుడనే పేరుందని, నవ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి దాని ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం నవీన్ యాదవ్ నైజమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాహితానికి పాటుపడుతున్న నవీన్ యాదవ్ గెలిపించుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు.ఈ ప్రచారంలో బెజ్జంకి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు డాక్టర్ పి. రాజశేఖర్ రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్, రాసూరి మల్లికార్జున్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్,రావుల నర్సయ్య, వి.సంపత్ రెడ్డి, పులి రమేశ్, మధుసూదన్, సాదిక్, వేణు, సంతు తదితరులు పాల్గొన్నారు



# నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు గౌరవం ఉండాలి

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షులు యలమందల జగదీష్

## నాయి బ్రాహ్మణుల ప్రతి షాపుకి రేట్ల పట్టిక, ఐడి కార్డులు పంపిణీ







**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తరతరాలుగా సమాజ సేవే లక్ష్యంగా కులవృత్తిని నమ్ముకుని పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు గౌరవం ఉండాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షులు యలమందల జగదీష్ అన్నారు. ఖమ్మం నగరంతో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయి బ్రాహ్మణులకు తన సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన ఐడి కార్డులతో పాటు రేట్ల పట్టికను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణులు తమ కులవృత్తిని కాపాడుకుంటూ సమాజంలో గౌరవంగా ఉండేందుకు ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనాదిగా వస్తున్న కులవృత్తిని సమాజ సేవలో భాగంగా జీవనోపాధి కొరకు మాత్రమే నాయి బ్రాహ్మణులు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. కానీ ఆర్థిక సంపాదనే ధ్యేయంగా కొన్ని కార్పొరేట్ శక్తులు నాయి బ్రాహ్మణుల చేతుల్లో ఉన్నటువంటి కులవృత్తులను కొల్లగొట్టి, వ్యాపారం ఎవరైనా ఎక్కడైనా చేయవచ్చు అనే కుటిల బుద్ధితో వ్యాపారాలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని వాటన్నింటినీ ఎదుర్కోవటానికి నాయి బ్రాహ్మణులు సిద్ధంగా ఉండాలని గుర్తు చేశారు. కార్పొరేట్ శక్తులు చేసేది వ్యాపార దృక్పథమే కానీ సమాజానికి మేలు చేసేదిగా ఉండదని, ప్రజలు కూడా గమనించాలని పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణులు ప్రతి కార్యాన్ని కూడా స్వయాన ఇంటికి వెళ్లి సేవలు అందిస్తారని అందుకే నాయి బ్రాహ్మణులకు సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని తెలియజేశారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్ లో ఉన్న నాయి బ్రాహ్మణ సోదరులందరికీ షాపు షాపుకి రేట్ల పట్టిక, షాపులలో పనిచేసే వారికి యలమందల జగదీష్ తన సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన సంఘ ఐడీ కార్డ్స్ ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ను సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నంద్యాల నరసింహారావు, నగర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు, నగర ఉపాధ్యక్షులు శ్రీరాముల విజయ్, నగర సహాయ కార్యదర్శి సురభి సందీప్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి, వరంగల్ క్రాస్ రోడ్డు అధ్యక్షులు మాదాపూర్ సైదులు, ప్రధాన కార్యదర్శి శ్రీరాముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పెద్దల ఆర్థిక సాయం



**రామన్నపేట 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన చలమళ్ళ శ్రీనివాస్ ఇటీవల అకస్మాత్తుగా మరణించగా వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి "చేయి చేయి కలుపుదాం శ్రీనివాస్ కుటుంబానికి భరోసానిద్దాం"అనే నినాదానికి ముందుకు వచ్చి కొంగరి బాలరాజు అకౌంట్ లో వేసిన 94,317 రూపాయలను మంగళవారం గ్రామ పెద్దలు అందరూ కలిసి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు.వారి భార్య పిల్లలకు ధైర్యం చెబుతూ శ్రీనివాస్ లేని లోటు తీర్చలేనిదని,ధైర్యంగా ముందుకు సాగాలని,మీ కుటుంబానికి గ్రామం భరోసాగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తినిస్తాయి అని అన్నారు.శ్రీనివాస్ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి కూడా అభినందనలు తెలిపారు.గ్రామ మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు,మాజీ ఎంపిటిసి బడుగు రమేష్, పద్మశాలి సంఘం అధ్యక్షులు జెల్ల శ్రీనివాస్, నాయకులు గోశిక చక్రపాణి, సాయిని శేఖర్, పున్న భద్రాచలం, పున్న కనకరత్నం, చిలువేరు వెంకటయ్య, మూడుదొడ్ల రాజు, దొంత యాదగిరి, పున్న యాదగిరి, గంజి రామకృష్ణ, పున్న శివ కుమార్, సింగం ఉపేందర్ తో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి: ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ

## • విద్యార్థుల హాజరుపై, విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించాలి







**ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు రాబోయే పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో కృషి చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సూచించారు. మంగళవారం కలెక్టరేట్లో విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఎంఈఓలతో జిల్లా విద్యా పరిస్థితులపై డాక్టర్ శ్రీజ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థి జీవితంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు మలుపు తిరిగే దశలని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు వారానికి రెండుసార్లు తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల అభ్యాసంపై ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు.సబ్జెక్టుల వారీగా విద్యార్థుల బలహీనతలను గుర్తించి, అదనపు శిక్షణ ఇవ్వాలని, ముఖ్యమైన పాఠ్యాంశాలను పునరావృతంగా బోధిస్తూ ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆమె సూచించారు. ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు లక్ష్యాన్ని చేరేలా ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ హితవు పలికారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్‌లో వంద శాతం నమోదు కావాలని, హాజరు శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గైర్హాజరు విద్యార్థుల వివరాలు తెలుసుకుని, వారిని తిరిగి తరగతులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అదే విధంగా, ప్రతి విద్యార్థికి అపార్ నంబర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని, సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. యుడైస్ పోర్టల్‌లో ప్రతి విద్యార్థి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.మండల విద్యాధికారులు పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, ప్రతి విద్యాసంస్థలో హాజరు శాతం 90 శాతానికి మించి ఉండేలా చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు.సమీక్ష సందర్భంగా హైస్కూల్ హెడ్‌మాస్టర్ల హ్యాండ్‌బుక్‌ను డాక్టర్ పి. శ్రీజ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి'




**ములుగు నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** బాలల హక్కుల పరిరక్షణ కోసం యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా సంక్షేమాధికారి తుల రవి అన్నారు. సఖి కేంద్రంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. బాల్యం అమూల్యమైందని, చిన్నారులు కార్మికులుగా మారొద్దన్నారు. బాల కార్మికులు లేని జిల్లాగా ములుగును తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని కోరారు. చిన్నారులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# చేప పిల్లల విడుదలకు పక్కా కార్యాచరణ అమలు చేయాలి: ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ



## నవంబర్ 6లోపు మండల, గ్రామ కమిటీల ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు



**ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం సక్రమంగా, పారదర్శకంగా సాగేందుకు పక్కా కార్యాచరణ అమలు చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. చేప పిల్లలను నీటి వనరుల్లో విడుదల చేసే ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని సూచించారు.ప్రతి మండలంలో ఉన్న నీటి వనరుల్లో చేప పిల్లల పంపిణీ పకడ్బందీగా జరిగేలా చూడాలి. కాలుష్యం ఎక్కువగా ఉన్న లేదా వరదలతో ఓవర్‌ఫ్లో అయ్యే చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేయకూడదు,అని కలెక్టర్ హెచ్చరించారు.జిల్లాలోని 882 చెరువుల్లో ఉచితంగా చేప పిల్లల పంపిణీ జరుగుతుందని, వాటిలో 35%-%40 మి.మీ. మరియు 80%-%100 మి.మీ. సైజ్‌ల చేప పిల్లలను నీటి వనరుల పరిస్థితుల ఆధారంగా విడుదల చేస్తామని తెలిపారు.మండల, గ్రామ స్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని సూచిస్తూ, ఎంపీడీఓ, ఇరిగేషన్ ఏఈ, వ్యవసాయ అధికారి, ఫిషరీస్ కో-ఆపరేటివ్ అధ్యక్షులు, మత్స్యకార సంఘ సభ్యులతో మండల స్థాయి కమిటీలు, అలాగే పంచాయతీ కార్యదర్శి, ఏఈఓ, ఫిషరీస్ కో-ఆపరేటివ్ సభ్యులతో గ్రామ కమిటీలు నవంబర్ 6లోపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రతి మండలంలో చేప పిల్లల పంపిణీ వివరాలను టీ-మత్స్య యాప్‌లో నమోదు చేయాలని, అలాగే ప్రతి ప్యాకెట్‌లో ఉన్న చేప పిల్లల సంఖ్యను ర్యాండమ్ చెకింగ్ ద్వారా ధృవీకరించాలని సూచించారు. ప్యాకెట్‌లో ఆక్సిజన్ సమృద్ధిగా ఉండేలా చూడాలి. నీటి వనరుల్లో చేప పిల్లలు విడుదల చేసే సమయంలో కమిటీ సభ్యులు, మత్స్యకారులు హాజరుగా ఉండాలి. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలి, అని అన్నారు.మత్స్యకార కో-ఆపరేటివ్ సభ్యులతో చర్చించి షెడ్యూల్ రూపొందించి 15 రోజులలో చేప పిల్లల విడుదల పూర్తిచేయాలి అని ఆదేశించారు. ప్రతి రోజూ చేప పిల్లల విడుదలకు సంబంధించిన నివేదికను సమర్పించాలని సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### - తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్




**షాద్ నగర్, 4 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు షాద్నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గత రెండు రోజుల నుంచి జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులో ఆయన రంగారెడ్డి జిల్లా రిపోర్టును ప్రవేశ పెడుతూ మాట్లాడారు భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు 12 వేల రూపాయలను పూర్తిస్థాయిలో ఇవ్వాలని మహిళలకు నెలకు 2500 ఇవ్వాలని మరియు వృద్ధాప్య పెన్షన్లు 2000 నుంచి 4000 పెంచాలని గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇంద్రమ్మ ఇల్లు కట్టివాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పై ఐక్య పోరాటాలు నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కరించే విధంగా పోరాడుతామని అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తమ సంఘంలో నిరంతర పోరాటాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ తెలిపారు.

# మీ అక్రమ వ్యాపారాలను చట్టబద్ధం చేయాలా.?: టీజేఎస్ఎస్

**అక్రమ నిర్మాణాల మాఫియాకు ప్రభుత్వం అడ్డుకట్ట వెయ్యలేదా.?**

**అంబులెన్స్ కూడా పోనీ గల్లీలో 5,6 అంతస్తుల అక్రమ నిర్మాణాలు చేసే ఘనత మీదే**

**మీ అక్రమ నిర్మాణాలతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి**

**2 అంతస్తులకు అనుమతులు తీసుకొని 5, 6 అక్రమ అంతస్తులు చేయడం మీ ప్రత్యేకత**

**అధికారులు,స్థానికులు ప్రశ్నిస్తే బెదిరిస్తాం ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకుల అండ అంటూ హెచ్చరిస్తాం**

**రిపోర్టర్లు రాస్తే దాడులు చేస్తాం, తిరిగి వాళ్ళ పైనే అక్రమ కేసులు పెడతాం**

**మా అక్రమ సంపాదనకు అడ్డు వస్తే ఎవరినైనా వేధిస్తాం, అంతం చేస్తాం**

**ఇంకుడు గుంతలు పెట్టం, మొక్కలు నాటం, పర్యావరణ పరిరక్షణ మాకు అవసరం లేదు అక్రమ సంపాదనే మాకు ముఖ్యం**

**డ్రైనేజీ, తాగునీటి సమస్య ఏర్పడ్డ మాకు సంబంధం లేదు. అక్రమ నిర్మాణాలు చేయడమే మా లక్ష్యం**

**మేము స్థానికులం, మేము చేసే అక్రమాలను గుర్తించి సహకరించి గౌరవించాలి, లేదంటే మాఫియా కోసం తెలుసుగా..**

**ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం, ప్రభుత్వ రూల్స్ లెక్కచేయకపోవటం అంతా మా ఇష్టం.**

**మీరు కట్టే అక్రమ నిర్మాణాలలో అగ్ని ప్రమాదం జరిగితే ఆటో కూడా పోదు, మరి ఫైర్ ఇంజన్, అంబులెన్స్ ఎలా పోతుంది.? ప్రాణాలు ఎలా రక్షిస్తుంది.?**

**రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ షాపింగ్ మాల్స్, అపార్ట్మెంట్లు కట్టి ప్రభుత్వానికి నష్టం చేస్తున్నారుగా**

**చట్టానికి వ్యతిరేకంగా తప్పుడు పత్రాలతో కోర్టు స్టేలు తీసుకువచ్చి లో లోపల నిర్మాణ పనులు దొంగతనంగా చేసుకోవడం మా ప్రత్యేకత**

**హైదరాబాద్ నవంబర్ 04 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాల మాఫియా జోరందుకుంది. కొంతమంది బిల్డర్లు ఏకమై ఒక మాఫియాగా మారి అక్రమ నిర్మాణాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పేరుకు అసోసియేషన్ అని పెట్టుకున్న చేసేది మాఫియా పనులే, అక్రమ నిర్మాణాల మాఫియా, బిల్డర్లు చేసే అక్రమ నిర్మాణాల దందాను ఎవరైనా ప్రశ్నించిన, అడ్డువచ్చిన అంతే అక్రమ సంపాదనతో కోట్లు సంపాదించి ధన గర్వంతో వాళ్లపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం వీళ్లకు ఆనవాయితీగా మారిందని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ అక్రమ నిర్మాణాల మాఫియాను చట్టబద్ధం చేయాలంటూ డిమాండ్ చేయడం నగర వాసులను భయాందోళనకు గురిచేస్తుంది. అసలే ఈ అక్రమ నిర్మాణాల మాఫియాతో గ్రేటర్ హైదరాబాద్ భ్రష్టు పట్టిపోయింది రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి, బోరు నీరు, వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నీరు నిలవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి కేవలం ఈ అక్రమ నిర్మాణాల మాఫియా తోనే. ఇప్పుడు ఈ మాఫియా బిల్డర్ల అసోసియేషన్ పేరుతో ప్రజాప్రతినిధులను, రాజకీయ నాయకులను కలిసి వినతి పత్రాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. దొంగలకు తాళాలు ఇవ్వాలన్న చందసంగ మారిందన్నారు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు అక్రమ నిర్మాణాలు చేసుకుని అవినీతి అక్రమాలను కూడా చట్టబద్ధం చేయాలనడం, అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు, తాగునీటి, డ్రైనేజీ కనెక్షన్ లను ఇవ్వాలనడం, అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయాలనడం, ప్రభుత్వ శాఖ అధికారుల వత్తుళ్లు చేయవద్దు అనడం చూస్తుంటే ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన చట్టాలు, రూల్స్ వృధా అని మున్సిపల్ చట్టం దండగా అన్నట్లుగా ఉంది వీళ్ళ వ్యవహారం. జిహెచ్ఎంసి రూల్స్ తుంగలో తొక్కి మేము స్థానికులమన్న సాకుతో ఈ మాఫియా భారీగా అక్రమ నిర్మాణాలు చేసి కోట్లకు పడగలెత్తి అక్రమ సంపాదన కు మరిగి ప్రశ్నించిన జర్నలిస్టులపై ఆర్థిక బలంతో దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టే మీ అక్రమ నిర్మాణాల వ్యాపారం గౌరవప్రదమైనాదా.? దొంగలే దొంగ దొంగ అన్నట్లుగా మీ వ్యవహార శైలి తో నగర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటో, అంబులెన్స్ కూడా వెళ్లలేని చిన్న చిన్న గల్లీలలో మీరు నిర్మిస్తున్న అక్రమ అపార్ట్మెంట్లలో అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్, అంబులెన్స్ ఎలా పోతుంది.? ప్రజల ప్రాణాలను ఎలా రక్షిస్తుంది.? మీ అక్రమ నిర్మాణాల వల్ల సమాజం కు ఎంత తీవ్ర నష్టం జరుగుతుందో ఒక్కసారైనా ఆత్మ పరిశీలన చేసుకున్నారా.? జిహెచ్ఎంసి మొత్తంలో వస్తున్న ఫిర్యాదులలో మీ అక్రమ నిర్మాణాల బాధితుల ఫిర్యాదులే 90% ఉన్నాయంటే ప్రజలను అక్రమ నిర్మాణాల మాఫియా ఎంత ఇబ్బందులకు గురి చేస్తుందో ప్రభుత్వం ఆలోచించాలి. చిన్న చిన్న గల్లీలలో 5, 6 అంతస్తుల అక్రమ నిర్మాణాలు కట్టి వారికి అనేక సమస్యలు సృష్టిస్తున్నారు. చిన్న గల్లీలలో మీ 5,6 అంతస్తుల అక్రమ నిర్మాణాలతో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయింది. మీ అక్రమ అపార్ట్మెంట్లకు భారీగా బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోవడం వాస్తవం కాదా.? వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నీరు నిలిచి చిన్న చెరువులుగా మారుతున్నాయి, మీరు నిర్మించిన అక్రమ అపార్ట్మెంట్లలో ఒక్క ఇంకుడు గుంత కూడా నిర్మించని మీరు ఎంత దుర్మార్గానికి పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు, చెట్లు లేక ప్రాణవాయువు తగ్గిపోతుంది మీ వల్ల ప్రకృతికి తీవ్ర నష్టం ఏర్పడి మానవజాతి మనుగడే ప్రశ్నార్థకంగా మీ అక్రమ నిర్మాణాల దందా సాగుతుంది. దీనిని చట్టబద్ధం చేయాలా.? అడిగేవాడికి సిగ్గు లేకున్న వినే వాడికి ఉండాలి అన్న చందసంగ మీ గొంతమ్మ కోరికలు చూస్తుంటే మున్సిపల్ చట్టం, ప్రభుత్వ చట్టాలు వృధా అన్నట్లు మీ అవినీతి వ్యాపారనికి, అక్రమ సంపాదనకు చట్టాలు అడ్డుగా మారాయని వాటిని ఎత్తివేయాలా.? అక్రమ నిర్మాణాలు చేసి అక్రమ సంపాదన భారీగా కూడబెట్టుకుని ఆర్థిక, రాజకీయ బలంతో అధికారులను, స్థానికులను, రిపోర్టర్లను బెదిరించె మీరే నిజమైన బ్లాక్ మెయిలర్లు కాదా.? సమాజాన్ని ఇంత నాశనం చేస్తున్న మీ అక్రమ నిర్మాణాల వ్యాపారం గౌరవప్రదమైనదా.? గౌరవంగా కొనసాగించాలా.? జిహెచ్ఎంసి మాస్టర్ ప్లాన్ తుంగలో తొక్కి రహదారుల విస్తరణ ఉండగా సెట్ బ్యాక్ చేయకుండా, రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని కమర్షియల్ షాపింగ్ మాల్స్, అపార్ట్మెంట్లు నిర్మించి రోడ్డు విస్తరణ జరగకుండా చేసి రోడ్డు యాక్సిడెంట్లు తో ప్రజల ప్రాణాలు పోతున్నాయి మీ వల్ల కాదా.? ప్రభుత్వ రూల్స్ పాటించి నిర్మాణాలు చేస్తే ప్రజలకు సమాజానికి ప్రకృతికి అన్ని విధాల రక్షణగా ఉంటుంది అందుకోసమే చట్టాలు ఏర్పాటు జరగాయన్న కనీస అవగాహన లేని మీరు బిల్డర్ల.? సమాజ శ్రేయస్సు ప్రజల సంక్షేమ కోరవలసింది పోయి మీ అక్రమ నిర్మాణాల అవినీతి దందా చట్టబద్ధం చేయాలనడాన్ని టీజేఎస్ఎస్ తీవ్రంగా ఖండిస్తుంది. సమాజానికి నష్టం చేసే ఇలాంటి మాఫియాలను అక్రమాలను అవినీతి వ్యాపారాలను ఏ ప్రభుత్వం ప్రోత్సహించదు, ఏ రాజకీయ నాయకుడు అండగా నిలవడు. ఒకవేళ ఎవరైనా నిలిస్తే వాళ్ళు చరిత్ర హీనులుగా మారక తప్పదని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం సభ్యులు హెచ్చరించారు.

# ప్రభుత్వం దిగొచ్చేంత వరకు పోరాటం ఆగదు










**రోడ్డెక్కిన పేద విద్యార్థుల ఆందోళన**

**ఖమ్మం పురవీధుల్లో కదం తొక్కిన విద్యార్థి లోకం**

**స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ కోసం ఏళ్ల తరబడి విద్యార్థుల ఎదురుచూపు**

**ఫీజులు విడుదల చేయకపోతే మా చదువులు కొనసాగేదెలా..?**

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో**

**వేలాదిమంది విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి, ఉద్రిక్తత**

**పోలీసులకు విద్యార్థి సంఘ నాయకులకు తోపులాట**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) : పేద విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని, ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఖమ్మం పురవీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తూ విద్యార్థిలోకం కదం తొక్కింది. మా స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ అని రోడ్లెక్కిన విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ నుంచి వేలాది మంది విద్యార్థులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడికి భారీ ప్రదర్శనగా వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావణం ఏర్పడింది. అక్కడే బేటాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ... గత నాలుగేళ్లగా ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదని, ప్రభుత్వం మారిన, పాలన మాత్రం అలానే ఉందని, విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని అయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ నాన్ ప్రొఫెషనల్ 2వేల కోట్లు, ప్రొఫెషనల్ 4వేల కోట్లు గాను పెండింగ్ ఉపకార వేతనాలు ఉన్నాయని, 2021 -22 ప్రభుత్వం విడుదల చేసిన బకాయులు 30శాతం, 2022 -23 గాను 20శాతం,2023 -24, 2024- 25, 2025-26 మొత్తం బకాయిలు ఉండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పలుమార్లు నిర్వదిక బంద్ నిర్వహించినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందనలేదని అయన విమర్శించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. గత నాలుగు ఏళ్లుగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ శాతం ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్నారని, గత నాలుగేళ్లగా లక్షల సంఖ్యలో బీటెక్, డిగ్రీ, వైద్య విద్య ప్రొఫెషనల్ కోర్సులు కొనసాగిస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదివే ఇంజనీరింగ్ కళాశాలకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈబిసి, మైనార్టీ విద్యార్థులకు 35వేల చొప్పున ఫీజు రియంబర్స్మెంట్ అందించాల్సిన అవసరం ఉందన్నారు. డిగ్రీ విద్యార్థులకు సుమారుగా 18వేల నుంచి 35వేల వరకు అందించాల్సి అవసరం ఉందన్నారు. కనీసం ఈ విద్యా సంవత్సరమైనా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మొత్తం 10,300 వేల కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉండడంతో విద్యార్థల తీవ్రఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పిజు,రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా కేంద్రంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, జిల్లా సహా కార్యదర్శులు షేక్ నాగులమేరా, మధు, శివ, వంశీ, మనోజ్, జిల్లా నాయకులు ఉస్మాన్, ఉపేందర్, గోపి, వెంకట్, నవీన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# భట్టి నియోజకవర్గంలోనే హత్యలు

### సామినేని హంతకులను కాపాడే రీతిలో విచారణ

### రాజకీయ హత్యగా పేర్కొనటంలో పోలీసుశాఖ నిరాసక్తత

### సార్, మేడం చూసుకుంటారనే ధైర్యంతోనే హత్యలు, అరాచకాలు..?

### నిందితులను వదిలి బాధితులను ఇబ్బంది పెట్టే రీతిలో ఎంక్వైరీ

### న్యాయబద్ధ విచారణ సాగకపోతే పోలీసు కార్యాలయాల ముట్టడి

### ఐదు రోజులైనా నిందితులను తేల్చటంలో సీపీ తాత్సారం..?

### రామారావు హత్య కేసు విచారణ సాగుతున్న తీరుకు నిరసనగా ఖమ్మంలో సీపీఐ(ఎం) ప్రదర్శనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, నున్నా









**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని హత్యల పరంపర కేవలం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలోనే ఎందుకు కొనసాగుతోందని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి, చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన సామినేని రామారావు హత్య జరిగి ఐదురోజులు అవుతున్నా నిందితులను తేల్చటంలో పోలీసుశాఖ, సీపీ నిర్లక్ష్యం వహిస్తున్నాడని ధ్వజమెత్తారు. హంతకులను కాపాడే రీతిలో విచారణ సాగుతోందని ఆరోపించారు. నిందితులను వదిలి బాధితులను ఇబ్బంది పెట్టే రీతిలో ఎంక్వైరీ ఉందన్నారు. రాజ్యాంగ బద్ధంగా, న్యాయబద్ధంగా విచారణ సాగకపోతే పోలీసు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. రామారావు హత్యకేసు విచారణ సాగుతున్న తీరుకు నిరసనగా సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ, ఖమ్మం రూరల్ మండల కమిటీల ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వైరా రోడ్డుమీదుగా జడ్పీ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యాదర్శి వై. విక్రమ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్తో కలిసి పోతినేని సుదర్శన్ రావు మాట్లాడారు.ఓ మంచి విప్లవకారుడైన రామారావును అక్టోబర్ 31వ తేదీన హత్యచేశారని ఆరోపించారు. మధిర నియోజకవర్గంలో కొనసాగుతున్న హత్యల పరంపరలో భాగంగా కాంగ్రెస్ గూండాలు కుట్ర పన్ని హత్యచేశారన్నారు. ఈ హత్య జరిగి ఇప్పటికీ ఐదురోజులు అవుతోందని, ఘటన చోటుచేసుకోగానే పోలీసు క్లూస్ టీంలు, డాగ్ స్క్వాడ్లు వచ్చాయని, సీపీ సునీల్ దత్ వచ్చి కేసును వెంటనే ఛేదిస్తామన్నారు. ఈ కేసు విషయంలో పోలీసుశాఖ వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గంగా ఉందని విమర్శించారు.'నిందితులు ఫలానా వాళ్లు... వాళ్లను పట్టుకుని శిక్షించండి' అని రామారావు భార్య స్వరాజ్యం స్వయంగా పిటీషన్ ఇచ్చారని తెలిపారు. రామారావు భార్య నిందితులు ఎవరని పేర్కొన్నారో.... వారందరూ గ్రామంలోనే ఉన్నారని చెప్పారు. కానీ పోలీసు విచారణ రామారావు కుటుంబంపై సాగుతోందా..? లేక నేరస్తులను పట్టుకోవాలనే రీతిలో విచారణ చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. పోలీసుశాఖ వ్యవహరించే తీరు ముద్దాయిలను కాపాడే పద్ధతిలో ఉందన్నారు. భట్టి ఎప్పుడైతే ప్రధాన పదవుల్లోకి వస్తారో... అప్పుడు మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ గూండాలు ప్రజా నాయకులను చంపివేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. పందిళ్లపల్లిలో అలవాల శ్రీనివాస్, గోవిందాపురం (ఎల్)లో ఎర్రబోయిన నాగేశ్వరరావు, ఇప్పుడు పాతర్లపాడులో సామినేని రామారావును అలాగే చంపివేశారన్నారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుకు... జరుగుతున్న హత్యలకు.. భట్టి విక్రమార్క పవర్లోకి రావడానికి మధ్య విడదీయరాని బంధం ఉందన్నారు. సీపీ సునీల్ దత్ దీనిని రాజకీయ హత్యగా పరిగణించడానికే సుముఖంగా లేరన్నారు. రాజకీయ హత్యగా పేర్కొనాలని ఎవరంటే.. వారిని ముద్దాయిగా చేస్తామని సీపీ హెచ్చరిస్తున్న తీరు అభ్యంతరకరం అన్నారు. హత్య జరిగి ఐదురోజులైంది... మీరూ వచ్చారు.. మీ క్లూస్ టీంలు వచ్చాయి కదా..? ఏమి చేశారు ఇప్పటి వరకు... ఫలానా వాళ్ల ముద్దాయంటే వారిని అరెస్టు చేస్తామంటారా? అని నిలదీశారు. అధికార యంత్రాంగం ఉంది కదా... భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు కదా.. ఆయన మధిరకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు కదా... అక్కడి విచారణ పద్ధతిలో ఎంక్వైరీ చేస్తాం... పోలీసు పద్ధతిలో కాకుండా కాంగ్రెస్ రీతిలో నిర్వహిస్తాం.. నేరాన్ని తెలుసుకునే పద్ధతిలో విచారణ చేయమని సీపీ చెప్పండని ప్రశ్నించారు. పోలీసువారు అలాగే విచారిస్తే ప్రజలే విచారిస్తారు. వారే దోషులను తేల్చుతారు... శిక్షిస్తారు... జాగ్రత్త అని హెచ్చరించారు. ఎందుకు మీరు విచారణను కాలేజీలు, స్కూళ్లు, ప్రిన్సిపాళ్లు, బంధువులు, రామారావు కుటుంబానికి ఎందుకు పరిమితం చేస్తున్నారని ప్రశ్నించారు.

**దొంగలకు సద్దులు మోసే పద్ధతిలో విచారణ**

దొంగలకు సద్దులు మోసే పద్ధతిలో విచారణ సాగుతోందని పోతినేని ధ్వజమెత్తారు. న్యాయమైన, రాజ్యాంగ పద్ధతిలో విచారణ చేస్తే సరేసరి... లేదంటే సీపీఐ(ఎం) సహించదని హెచ్చరించారు. మీరు ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత మధిర నియోజకవర్గంలోనే హత్యలు ఎందుకు జరుగుతున్నాయో సమాధానం చెప్పాలి?, నేరస్తులు స్పష్టంగా చెబుతున్నారు... మాకు సారున్నారు... మాకు మేడం ఉన్నారు.. ఏమి చేసినా సార్, మేడం చూసుకుంటారు... అట్లాగే చూసుకుంటారా..? హత్యలు, రౌడీయిజం, గూండాయిజం, అన్యాయం చేసినవాళ్లను ఇలాగే చూసుకుంటామంటే చెప్పండి... అప్పుడు ఎలా చూసుకోవాలో మేము కూడా చూసుకుంటాం... రాజ్యాంగబద్ధమైన పద్ధతుల్లో ఉండాలి తప్ప, చూసుకోవాలనే పద్ధతుల్లో మేము లేము చూసుకోవాల్సి వస్తే మాకూ చేతనవుతుంది. ఎట్లా చూసుకోవాలో.. చూసుకోవడానికి సిద్ధపడే పద్ధతిలో మేము లేం. కానీ అదే తప్పనిసరైతే తప్పక చూసుకుంటాం..." అని పోతినేని హెచ్చరించారు. పోలీసు యంత్రాంగం వెంటనే అప్రమత్తమై చర్యలు తీసుకోకపోతే ఇది ఇక్కడికే పరిమితం కాదన్నారు. మొత్తం పోలీసు కార్యాలయాలను ముట్టడిస్తామని సూచించారు. దోషులను తేలేదాకా... సరిగ్గా దోషులను నిర్ధారించి శిక్ష వేసే వరకూ ఆందోళనలు కొనసాగుతాయని, రామారావుకు విప్లవ జోహార్లు తెలుపుతూ ముగించారు.

**అధికార పార్టీ హంతకులను తప్పించే యత్నం : నున్నా నాగేశ్వరరావు**

అధికార పార్టీకి చెందిన హంతకులను కేసు నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఈ హత్యకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హత్యలను ఆపు చేయించకపోతే మూల్యం తప్పదన్నారు. విచారణ ప్రారంభం కాకముందే రాజకీయ హత్య కాదు అని సీపీ ఎలా అంటారని ప్రశ్నించారు. హత్య, మాఫియా రాజకీయాలను ఖండించాలని పిలుపునిచ్చారు. హంతకులను పట్టుకునే దాకా సీపీఐ (ఎం) నిద్రపోదు అన్నారు. ఉద్యమాలతోనే సమాధానం చెబుతామన్నారు. హత్యా నిందితులు మీ పక్కనే ఎందుకు తిరుగుతున్నారని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ, వన్టెన్, టూటౌన్, త్రీటౌన్, ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాల కార్యదర్శులు నాగుల్ మీరా, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు, ఎస్. నవీన్రెడ్డి, ఊరడి సుదర్శన్రెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మీరాసాహెబ్, సంద్ర ప్రసాద్, మెరుగు సత్యనారాయణ, మెరుగు రమణ, బండారు రమేశ్, ఎంఏ జబ్బార్, తుమ్మా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

---

# బూటకపు ఎన్కౌంటర్లలో కమ్యూనిస్టు విప్లవకారులు




### నాడు కాంగ్రెస్ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలో,నేడు బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టు విప్లవకారులను బూటకపు ఎన్ కౌంటర్లలో కాల్చి చంపుతున్నాయి

### అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్ష పతి

**యాదాద్రి నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భూమి,బుక్తి విముక్తి, సమసమాజ స్థాపన కోసం పోరాడుతున్న కమ్యూనిస్టు విప్లవ కారులను నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ చీకటి రోజులలో,నేడు బీజేపీ నరేంద్ర మోడీ,అమిత్ షా ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్ కౌంటర్లలో కాల్చి చంపుతున్నారని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి ఆరోపించారు.మంగళవారం నాడు యాదగిరిగుట్ట,రాజాపేట మండల పరిధిలోని సాదువెళ్లి, చిన్న గౌరాయపల్లి,రఘునాథ పురం గ్రామాలలో జరిగిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని జండావిష్కరణలు జరిగాయి.గ్రామ కమిటీ కార్యదర్శులు ఇంజ శ్రీనివాస్, కొంగరి సాయి రామ్, ఎర్ర మల్లేష్ లు పార్టీ జండాలను ఎగురవేశారు.ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన కమ్యూనిస్టు విప్లవ అమర యోధులు నిరంతరం నీటిలో చేపలా,తలలో నాలుకలా మెదిలారని ఎల్లపుడూ ప్రజల గుండెల్లో కొలువై ఉంటారని,వారి ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త ప్రజలను విప్లవంలో భాగస్వామ్యం చేయాలని కోరారు.కేంద్రంలో,రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ,కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల సమస్యల పరిష్కారంలో దొందూ దొందేనని అన్నారు.బీజేపీ ఇచ్చిన వాగ్దానం ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేని స్థితిలో ఉన్నదని,రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసు మేరకు కనీస మద్దతు ధర చెల్లించకుండా తప్పించుకుంటుందని,వర్షాల వల్ల రైతులు తమ ధాన్యం తడిసిపోయి అల్లాడుతుంటే,ఇవి ఏమీ పట్టకుండా ఎంత సేపు మతతత్వ ఆలోచనతో ప్రజలను తమ మౌలిక సమస్యల నుంచి తప్పుదోవపట్టించే మతోన్మాద అరాచక పాలనకు పూను కుంటుందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్,ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, గడ్డం మంకయ్య, ఉచ్చంతల మల్లేష్,

సుంకె సుగుణ,సుంకె బాలయ్య,జాలిగం భుజంగం, మీస నర్సయ్య,ఇంజ రామచంద్రయ్య,బరిగే రాములు, గడ్డం యాదగిరి, బోగ పుండరీకం, దయ్యాల రాములు, డొంకెన శ్రీను, జాలిగం అంజయ్య,ఓరుగంటి కిష్టయ్య, దయ్యాల సిద్దులు,

ఈరోళ్ళ బాలయ్య, శవ్వాల సిద్దులు, ఇంజ కిష్టయ్య, డొంకెన లక్ష్మీ నర్సు,మేక అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

---


# ప్రభుత్వ నిర్లక్ష్య నీడన వరుస రహదారి ప్రమాదాలు

### ఓవర్ లోడ్ రవాణాపై అధికారుల చర్యలేవీ?

### ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్, ఆక్యూపెన్సీ లిమిట్ వద్దా?

### ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే లెక్కేలేదు!

### ప్రభుత్వంపై ఫైర్ అయిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి




**షాద్ నగర్,నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :**నిన్న చేవెళ్ల మండలం, మీర్జాపూర్ దగ్గర జరిగిన టిప్పర్, బస్సు దుర్ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు వారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వరుసగా జరుగుతున్న రహదారి ప్రమాదాలకు ప్రభుత్వ రవాణా వ్యవస్థ నిర్లక్ష్యమే కారణమని ఫైర్ అయ్యారు. అనేక సంవత్సరాలుగా రద్దీగా ఉండే రహదారి విస్తరణ చేపట్టక వరుస ప్రమాదాలు జరుగుతున్న గత, ప్రస్తుత ప్రభుత్వాలు తమకు పట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలు,%ట% టిప్పర్లను రవాణా అధికారులు మామూళ్ల మాయలో పడి చూసి చూడనట్లుగా వదిలి వేయడం సామాన్యుల ప్రాణాలకు సంకటంగా మారిందని అన్నారు. ప్రభుత్వ ఉచిత హామీ వల్ల ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే మహిళ ప్రయాణికుల సంఖ్య పెరగడం కారణంగాను, ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్ లేకపోవడం కారణంగాను, అధికారుల నిర్వహణ లోపం వల్ల బస్సుల్లో వరుస ప్రమాదాలు జరగడం బాధాకరం అన్నారు. నిన్నటి ఘటన 20 కుటుంబాలను చిన్నాభిన్నం చేసిందని, ఏమిస్తే ఆ కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు అంటే విలువే లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, వ్యవస్థలను గాడిలో పెట్టి ప్రజల ప్రాణాలను రక్షించాలని సూచించారు. బిజెపి సీనియర్ నాయకులు మోహన్ సింగ్, నరసింహ యాదవ్, సుధాకర్ అప్ప, కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపూర్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

---


# పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు: ములుగు ఎస్పీ శబరిష్

**ములుగు నవంబర్ 4 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం ఇప్పించేలా కోర్ట్ తీర్పు చెప్పిందని ఎస్పీ శబరిష్ తెలిపారు. ములుగు జిల్లా వాజేడుకు మండలానికి చెందిన నిందితుడు సోడి సందీప్ పోక్సో కేసులో నిందితుడిగా



ఉన్నాడన్నారు. ఈ మేరకు మంగళవారం అతనిపై నేరం రుజువు కాగా జిల్లా కోర్టు జీవిత ఖైదుతో పాటు, రూ.9 వేల జరిమానా, బాధితురాలికి రూ. 10 లక్షల నష్టపరిహారం ఇచ్చేలా తీర్పునిచ్చిందన్నారు

# థ్రిల్లర్ మూవీలో మీనాక్షి



ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.

# పెద్దిలో మోహిత్ చౌహాన్ పాట



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో

# పిఠాపురంలో..అలా మొదలయ్యింది



తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్‌ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.


# రాజాసాబ్ సంక్రాంతికి పక్కా



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# చరణ్ ను ఫాలో అవుతున్న రామ్





తెలుగు సినిమా హీరోల ట్యాగ్ అప్పుడప్పుడు మారుతూ ఉండటం చాలా సందర్భాల్లో చూస్తూనే వచ్చాం. హీరో కెరీర్లో బాగా పైకి ఎదిగినప్పుడో లేదంటే భారీ హిట్ అందుకున్నప్పుడో, ఆ స్థాయికి తగ్గట్టు కొత్త ట్యాగ్ ను పెట్టుకోవాలని భావించి, ఆ ఇమేజ్ కు తగ్గ ట్యాగ్స్ ను పెట్టుకుంటారు. అయితే ఆ ట్యాగ్స్ ను ఆడియన్స్ అన్నీ సందర్భాల్లో యాక్సెప్ట్ చేయాలని లేదు. గ్లోబల్ స్టార్ నుంచి మళ్లీ మెగా పవర్ స్టార్ చరణ్ ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్ ఆ సినిమా తర్వాత తన పేరుకు ముందు గ్లోబల్ స్టార్ అనే కొత్త ట్యాగ్ ను తగిలించుకుని, పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్ ను పక్కన పెట్టారు. కానీ చరణ్ గ్లోబల్ స్టార్ అనే ట్యాగ్ తో చేసిన ఆచార్య, గేమ్ ఛేంజర్ సినిమాలు ఫ్లాపవడంతో ఆ ట్యాగ్ పై నెట్టింట చాలా విమర్శలొచ్చాయి. దీంతో తన నెక్ట్స్ మూవీ కోసం చరణ్ తన పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్ గానే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఉస్తాద్ ను వద్దనుకుంటున్న రాపో ఇప్పుడు చరణ్ ను చూసి మరో యంగ్ హీరో కూడా అదే బాట పడుతున్నట్టు తెలుస్తోంది. అతను మరెవరో కాదు, టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని. టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ గా మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఇస్మార్ట్ శంకర్ సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత తన ట్యాగ్ ను ఉస్తాద్ గా మార్చుకున్నారు. ఎనర్జిటిక్ స్టార్ నుంచి ఉస్తాద్ గా మారినప్పటి నుంచి రామ్ ఇప్పటివరకు హిట్ ను అందుకున్నది లేదు. పైగా ఆడియన్స్, ఫ్యాన్స్ కూడా రామ్ ను ఉస్తాద్ అనే దానికంటే ఎనర్జిటిక్ స్టార్ అని పిలుచుకోవడానికే ఆసక్తి చూపారు. అందుకే ఇప్పుడు రామ్ తిరిగి తన పాత ట్యాగ్ కు షిఫ్ట్ అవుతున్నారు. తన తర్వాతి సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా కోసం రామ్ ఎనర్జిటిక్ స్టార్ అనే ట్యాగ్ నే పెట్టుకుంటున్నారు. కొత్త ట్యాగ్ లు పెట్టుకోవాలంటే ఫ్యాన్స్ కు ఇష్టముండాలని భావించిన చరణ్, రామ్ ఇకపై తమ పాత ట్యాగ్‌ల తోనే కంటిన్యూ అవాలని ఆసక్తి చూపుతున్నారు.

# దుల్కర్ సల్మాన్..కాంత మూవీ




మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు.ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.